క్లుప్తంగా

హైరిస్క్ గర్భిణుల తరలింపు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు లలిత, పూజ్య మేఘన

దేవరాపల్లి: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ యోజనలో భాగంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులను వైద్యాధికారులు ఎస్. లలిత, ఇ. పూజ్య మేఘన పరీక్షించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, బీపీ తనిఖీ చేశారు. రక్తహీనత ఉన్నవారికి మందులు అందజేశారు. 21 మంది గర్భిణుల్లో ఐదుగురు హైరిస్క్ గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్య సేవల కోసం కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అంతకు ముందు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. సీహెచ్‌వో ఎస్.వి.వి.ఎస్. ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎన్ఆర్ఐ పిట్టా మూర్తి

నర్సీపట్నం: నింజాస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఎన్ఆర్ఐ పిట్టా మూర్తి రూ.30 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని క్రీడాకారులకు పంపిణీ చేశారు. గ్లౌజ్‌లు, పుష్అప్ ప్యాడ్‌లు, మెడిసిన్ బాల్ వంటి సామగ్రిని అందజేశారు. సీనియర్ బాక్సర్లు మౌనిక, ప్రియాంక, తేజస్విని, లాస్య, జ్యోతి, శశి బాక్సింగ్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రీకాంత్, సీనియర్ కోచ్ యర్రా శేఖర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల బాధ్యత టెక్నికల్ అసిస్టెంట్లదే



ఇళ్ల నిర్మాణాలపై సూచనలు చేస్తున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం: ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని అధిగమించకపోతే టెక్నికల్ అసిస్టెంట్లే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉగాది కల్లా 356 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఇంతవరకు 218 పూర్తి చేశామన్నారు. 732 ఇళ్లు వివిధ దశల నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. గ్రామసభలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని అధిగమించేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సకాలంలో నిర్మాణాలు ప్రారంభించకపోతే ఇల్లు రద్దు చేస్తామన్నారు. హౌసింగ్ జేఈ జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్.సునీత పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు నర్సీపట్నం గురుకుల పాఠశాల, కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నాగయ్యపేట ఆశ్రమంలో అన్నదానం

దేవరాపల్లి: నాగయ్యపేటలోని సద్గురు చిన్మయి వెల్ఫేర్ ట్రస్టు ఆశ్రమంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైవాడ గ్రామానికి చెందిన స్వర్గీయ గొలగాన అప్పారావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు రమణ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు రమణను అభినందించారు.

భూసర్వేలో తలెత్తిన లోపాలకు పరిష్కార చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ కనకారావు



సమస్యలు తలెత్తిన రైతుల నుంచి భూవివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

రోలుగుంట: భూ సర్వేలో తలెత్తిన లోపాలకు అధికారులు పరిష్కార చర్యలు చేపట్టారు. తొలి విడతలో సర్వే పూర్తయిన అయిదు రెవెన్యూ గ్రామాల్లో వెదుళ్లవలసలో 118 ఖాతాల్లో లోపాలు తలెత్తాయి. ఆ సమస్య తెలుసుకున్న తహసీల్దార్ కె.వెంకటేశ్వర్రావు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి నివేదిక అందజేశారు. కలెక్టరు ఆదేశాల మేరకు సర్వే లోపాలు తలెత్తిన గ్రామాల్లో పరిష్కరించుకోవాలని ఈ నెల 6, 7, 8 తేదీల్లో ప్రచారం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఎస్. నరేంద్రబాబు ఆధ్వర్యంలో వీఆర్వోలు, అసిస్టెంట్లు, సచివాయల సర్వేయర్లు గురువారం కొవ్వూరు సచివాలయంలో కచ్చిత పద్ధతిలో లోపాల సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలిరోజు 44 మంది ఖాతాలను సరి చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 12వ తేదీ వరకూ నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. వీఆర్వోలు నాగమణి, కె.రాజు, నూకరాజు, అసిస్టెంటు గుడాల రాజు, కె.నాయుడుపాలెం, రోలుగుంట సచివాలయ సర్వేయర్లు పి.గిరిజ, ఎ.లక్ష్మణ పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ సర్వే చేస్తాం

నాతవరం: సమగ్ర భూరీసర్వే పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామన్నారు. సరుగుడు రెవెన్యూ గ్యాప్ ఏరియా ప్రాంతం కావడంతో డ్రోన్ సర్వే చేయలేదన్నారు. ఇంతవరకు రీసర్వే పూర్తి చేసిన నాలుగు రెవెన్యూ గ్రామాల్లో రైతులకు పాసు పుస్తకాలు జారీ చేశామన్నారు. మిగతా మూడు గ్రామాల్లో త్వరలో ఇస్తామన్నారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో ఏవైనా లోపాలుంటే రైతులు సరి చేసుకోవడానికి ప్రభుత్వం మరలా అవకాశం కల్పించిందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పి.కనకారావు, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, సచివాలయ సర్వేయరు విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రావికమతం: కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం ఉత్సాహంగా జరిగింది. ప్రిన్సిపాల్ సాయికుమార్, కమిటి చైర్మన్ రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ ప్రత్యేకాధికారి, 11 హైస్కూళ్ల హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. కళాశాల ప్రగతి చదివి వినిపించడంతోపాటు ప్రతి సబ్జెక్టులో టాప్‌టెన్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రోలుగుంట: పాఠశాలల్లో నిర్వహించే వీడ్కోలు కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆత్మీయ బంధాలు మెరుగుపడతాయని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో వీడ్కోలు వేడుక కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం అధ్యాపక బృందం సమష్టి కృషి గురించి ప్రిన్సిపాల్ వివరించారు. పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు, మార్కుల సాధన తదితర విషయాలపై కేజీబీవీ ఎస్‌వో ఎన్.తులసి, కొంతలం, చెట్టుపల్లి హైస్కూళ్ల హెచ్‌ఎంలు బి.వి.రమణ, బండారు రాఘవనాయుడు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విజేతలకు ఎంపీపీ బహుమతులను అందజేశారు.

పింఛనుదారుల సమస్యలపై వినతి



ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న పింఛనుదారులు

నర్సీపట్నం: ప్రభుత్వ పెన్షనర్లకు 11వ పీఆర్సీ, ఏరియర్స్ బకాయిలను తక్షణమే చెల్లించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి. గజ్జలమ్మ కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో హెచ్.వి.జయరాంకు అందజేశారు. పెన్షన్లు చెల్లింపులో తీవ్రజాప్యం చేయడం వల్ల పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. హెల్త్‌కార్డులు అమలయ్యేలా చూడాలన్నారు. పెండింగ్ మెడికల్ బిల్లు చెల్లించాలన్నారు. శ్రీకాకుళం త్రినాథరావు, సభ్యులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రభుత్వ పింఛనుదారుల సంఘం సభ్యులు తహసీల్దార్ ప్రసాదరావుకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు కోసూరు రామారావు మాట్లాడుతూ వీటి పరిష్కారానికి దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు, సభ్యులు వెంకటరాజు, అచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాటలో ముగ్గురి అరెస్ట్

కొంకోట : స్థానిక పూసర్లవీధిలో నగదు పందెం పెట్టి పేకాట ఆడుతుండగా ముగ్గుర్ని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. వారి నుంచి రూ.740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: కస్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని రామన్నపాలెం, భీమబోయినపాలెం, కస్నూరుపాలెం అగ్రికల్చర్, తోటకూరపాలెం క్వారీ ప్రాంతాల ఫీడర్లలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నర్సీపట్నం డీఈ సురేష్‌బాబు తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

బుచ్చెయ్యపేట: మండలంలోని పోలేపల్లి, జన్నవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేతస్తున్న ఏఈ రాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు బుచ్చెయ్యపేట తోపాటు రెండు సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతరలు



మావుళ్లమ్మకు శతమానాలు బహూకరిస్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని రెండు గ్రామాల్లో గ్రామదేవతల జాతరలు ఘనంగా నిర్వహించారు. శెట్టిపాలెంలో బోడకొండమ్మతల్లి, బయ్యవరంలో మావుళ్లమ్మ అమ్మవారి జాతరలను గురువారం స్థానికులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి కమిటీల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారు శతమానాల బహూకరణ..

బయ్యవరం గ్రామానికి చెందిన లాలం సూర్యనారాయణ దంపతులు మావుళ్లమ్మ అమ్మవారి పండగ సందర్భంగా రూ.1.60 లక్షల విలువ చేసే బంగారు శతమానాలను బహూకరించారు. సర్పంచ్ లాలం కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ సమీపంలోని మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేగి గాంధీ సారధ్యంలో సాయంత్రం భజనా కార్యక్రమం నిర్వహించారు. కాళ్ల వారి నూతి వద్ద ఎరుకుమాంబ, మహలక్ష్మమ్మ ఆలయాల్లో పూజలు చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట: పట్టభద్రులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కె.కోటపాడు: సూదివలసలో జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్



నర్సీపట్నం: పట్టభద్రులను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సన్యాసిపాత్రుడు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం బుచ్చెయ్యపేటలో ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేయడం వల్ల ఉత్తరాంధ్రలో అనేక పరిశ్రమలు ఏర్పడి లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీఎం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న నీచ రాజకీయాలను ఎండగట్టాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు మరిసా నాని, దేవర అప్పారావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, పాల సంఘం అధ్యక్షుడు బాబ్జి, మాజీ సర్పంచ్ సుంకరి గాంధీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీరా అర్జునరావు తదితర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతమైన పాలనలతో అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. పిండ్రంగి, లంకవానిపాలెం, కొరువాడ, గవరపాలెం, వి.సంతపాలెం, ఆనందపురం, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో గురువారం వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంరాజుకు ఓటు వేయాలని కోరారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, సర్పంచ్‌లు జాగరపు వెంకట రామలక్ష్మి, చీపురపల్లి అచ్చిబాబు, వంటాకు అప్పాజి, లెక్కల దేవీలత, బండారు మంగపతి, బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, పార్టీ నాయకులతో కలిసి గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. బ్యాంక్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి బ్యాలెట్ పేపరు అందజేసి కోరారు.

మాడుగుల/మాడుగుల రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ గురువారం సత్యవరంలో ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ కార్యకర్తలను, వలంటీర్లను, సచివాలయ సిబ్బందిని కలిసి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నూతన వధూవరులు జాజుల మణికంఠ, నూకరత్నంలను అభ్యర్థించారు. ఎంపీటీసీ సభ్యులు తలారి అప్పారావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇందుకూరి నాగరాజు, నాయకులు శనివాడ వెంకటరమణ, గోకాడ అప్పలనాయుడు, యలమంచిలి రమణ, కాతా వెంకటరమణ, పచ్చికోర మాణిక్యం, చల్లా మహేశ్, గోకాడ ఈశ్వరరావు, నందారపు అర్జున జె.డి.పేట, వి.వి.అగ్రహారం, పోతనపూడి, ఎం. కృష్ణాపురం, తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. నాయకులు కోశిరెడ్డి కృష్ణమూర్తి, దాడి రాజేశ్వరావు, వెలగాడ ఈశ్వరరావు, కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల: సత్యవరంలో వధువును ఓటు వేయాలని కోరుతున్న వైస్ ఎంపీపీ రాజారామ్

యాతల పూర్వాచారాన్ని కొనసాగించాలి



గోవాడలో యాతలతో సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్

చోడవరం రూరల్: గోవాడ గ్రామ దేవత పరిదేశమ్మ పూజాదికాలలో పూర్వం నుంచి పాటిస్తున్న ఆచారాన్నే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ యాతల సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ ఒనుం శ్రీనివాసరావు కోరారు. ఇటీవల గ్రామంలో పరిదేశమ్మ పండగ నిర్వహణ, అమ్మవారికి సమర్పించిన చీరలు వంటి కానుకలు, ప్రసాదాల విషయంలో స్థానిక యాతలకే పూర్తి హక్కులు ఉంటాయి. వారిని కాదని అమ్మవారికి వచ్చిన చీరలను వేలం వేయడానికి గ్రామ పెద్దలు, ఉత్సవ నిర్వాహకులు సంసిద్ధమయ్యారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన గురువారం ఇక్కడ యాతల కుటుంబాలతో చర్చించారు. బంజరు సైతం సాగు చేసుకునే వారమని, ఇప్పుడు వేరే అవసరాలకు కేటాయించారని వారు వాపోయారు. ఇలా యాతలను కనీసం పట్టించుకోకుండా గ్రామ పెద్దలు ఏకపక్ష నిర్ణయాలు చేయడం తగదని శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలతో తాను సంప్రదింపులు చేస్తానని హామీ ఇచ్చారు. ఎప్పటిలాగే యాతలకు అమ్మవారి పూజాదికాలను చేసుకునే హక్కును పునరుద్ధరించి, చీరలను వేలం ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

రోడ్డు విస్తరణపై అభ్యంతరాల స్వీకరణ


- నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ కనకారావు



మెయిన్‌రోడ్డు విస్తరణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ కనకారావు

నర్సీపట్నం: పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 17వ తేదీ వరకు స్వీకరించాలని మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం రోడ్డు విస్తరణపై సచివాలయ సిబ్బందికి డిజిటల్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పట్టణంలో రోడ్ల విస్తరణకు ప్రభుత్వం రూ.16.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. వీటితో మెయిన్ రోడ్డు వందడుగులు విస్తరించడంతోపాటు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు 40 అడుగుల మేర నూతనంగా రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఎఫ్ఎంబీ రికార్డు ప్రకారం రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ పంపించామన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ శాస్త్రీయ బద్ధంగా తయారు చేశామన్నారు. రోడ్డు విస్తరణపై బాధితులకు ఏమైనా సందేహాలు ఉంటే సచివాలయ సిబ్బంది నివృత్తి చేయాలన్నారు. ప్రస్తుతం ఇచ్చిన సెంటర్ మార్కింగ్‌ను ఆధారంగా చేసుకుని కుడి 50 అడుగులు, ఎడమ 50 అడుగులు ఉండేలా భవనాలపై మార్కింగ్ ఇవ్వాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులను చేస్తామన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేష్, డీఈ మహేష్, ఏఈ శ్రీనివాసరావు, సహాయ టౌన్ ప్లానింగ్ అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలు



మాకవరపాలెం : లారీని మరో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని అన్‌రాక్ రిఫైనరీకి వస్తున్న లారీ శెట్టిపాలెం వద్దకు వచ్చేసరికి తొలుత ఎదురుగా వస్తున్న కారును ఢీకొని అనంతరం వెనుక వస్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టింది. అన్‌రాక్‌కు వచ్చే లారీ డ్రైవర్ గాలి రమణ(50) నిద్ర మత్తులోకి వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ సంఘటనలో రెండు లారీల డ్రైవర్లు అయిన నర్సీపట్నంకు చెందిన ఈశ్వరరావుతోపాటు అన్‌రాక్ లారీ డ్రైవర్ రమణలకు తీవ్రగాయాలయ్యాయని, వీరిలో రమణ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలించారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి



ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించి సాధికారత తీసుకురావాలని హెచ్‌ఎం ఉదయ్ భాస్కర్ ఆకాంక్షించారు. ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులతోపాటు మిడ్డే మీల్స్ నిర్వాహకులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, కె. సత్యారావు, కె.వి.రమణ, పీడీ అప్పారావు, రాంబాబు, అంబేడ్కర్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

- వెంకటరాజుపురంలో 4 లీటర్ల సారా స్వాధీనం

దేవరాపల్లి: వెంకటరాజుపురంలో సారా విక్రయిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ డి. నాగేంద్ర వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లెక్కల చంద్రునాయుడు తన షాపు వద్ద సారా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పక్కా వ్యూహంతో తన సిబ్బందితో కలిసి దాడి చేయగా, నాలుగు లీటర్ల సారా పట్టుబడింది. వెంటనే అతడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించామని తెలిపారు.

పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజల్లో ధర్మశ్రీ దంపతులు

రాంబిల్లి : మామిడివాడలో గురువారం పైడితల్లమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దంపతులు శంకుస్థాపన పూజల్లో పాల్గొన్నారు. మామిడివాడ పరిసర గ్రామాల ప్రజలు పైడితల్లమ్మ అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విశ్వసిస్తారు. ప్రస్తుతం వున్న ఆలయం పక్కనే నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బొద్దపు ఎర్రయ్యదొర, నెట్టెం సత్యనారాయణ, కొటాపు వడ్డికాసులు, రాఘవేంద్ర, ఎస్.సన్యాసిరావు, సర్పంచ్ అప్పలనర్స, నాగరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

కె.కోటపాడు: వేసవి కాలంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్య జాగ్రత్తలను తీసుకోవడం ముఖ్యమని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం మేడిచర్లలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలందించారు. 126 మందికి ఓ.పి వైద్యం, అంగన్‌వాడీ, జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. 11 మంది ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. ఎండలో ఎక్కువ సేపు తిరగవద్దని సూచించారు. తాగునీరు ఎక్కువగా తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎం.ఎల్.హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం దేవి, రమణ పాల్గొన్నారు.